సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



అన్నదానానికి విరాళం


పిఠాపురం: పాదగయ క్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి తాడేపల్లి సీతారామమూర్తి(పిఠాపురం) రూ.లక్ష చెక్కును విరాళంగా సమర్పించినట్టు ట్రస్టుబోర్డు చైర్మన్ ప్రభాకరరావు తెలిపారు.



అన్నదానానికి లక్ష విరాళం

పెద్దాపురం: శృంగార వల్లభ స్వామి ఆలయంలో అన్నదానానికి గరిమెళ్ల లక్ష్మీనారాయణ శర్మ, సత్యసుబ్బలక్ష్మి దంపతులు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని ఈఓ నారాయణమూర్తి ద్వారా అందజేశారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజి నుంచి గురువారం తూర్పు డెల్టాకు 1850, మధ్య డెల్టాకు 1200,పశ్చిమ డెల్టాకు 320 ంక్యూసెక్కుల గోదావరి జలాలను వదిలారు.

రంజాన్ వేళలు

అమలాపురం

ఇఫ్తార్	-	సెహరీ
శుక్రవారం (సా)		శనివారం (ఉ)
6:25	-	4:30

న్యూస్‌రీల్

కన్నుల పండువగా శ్రీ పుష్పోత్సవం



ఆలయంలో శ్రీపుష్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవస్వామి శ్రీ పుష్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవాలు గురువారంతో ముగిశాయి. కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం గోవింద నామస్మరణతో మారుమోగింది. ఉదయం స్వామివారికి వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో మేలుకొలుపు, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి శ్రీ పుష్పోత్సవం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వై.బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లును పర్యవేక్షించారు.

వైభవంగా వెంకన్న చక్రస్నానం



గౌతమి గోదావరిలో స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్రేయపురం: కల్యాణోత్సవాల్లో భాగంగా కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి చక్రస్నాన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం ఆలయానికి భక్తులు వచ్చి కన్నులారా స్వామివారి చక్రస్నాన కార్యక్రమాన్ని తిలకించారు. ఉదయం స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పూర్ణాహుతి, బాలభోగం, ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు బోర సంవాదం జరిపించారు. స్వామివారిని పల్లకీపై ఉంచి, బాణసంచా కాల్పుల నడుమ బ్యాండ్ మేళాలతో గ్రామ వీధుల్లో ఊరేగించి, గౌతమీ గోదావరి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ గోదావరి సమీపంలో ఏర్పాటు చేసిన పూరిపాకలో స్వామివారిని ఉంచి పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారిని గౌతమీ గోదావరి వద్ద వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. శుక్రవారం స్వామి వారి శ్రీపుష్పోత్సవం నిర్వహిస్తారు.


పదో తరగతి పరీక్షలు ప్రశాంతం



ఐ.పోలవరం పోలీస్ స్టేషన్‌లో పేపర్లను భద్రత ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈఓ కమలకుమారి

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గురువారం జరిగిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఎం.కమలకుమారి తెలిపారు. జిల్లాలో 111 కేంద్రాలలో జరిగిన హిందీ పరీక్షకు 19,075 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 18,906 మంది హాజరయ్యారు. 169 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా అధికారులు, స్పెషల్ స్క్వాడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగలేదని డీఈఓ తెలిపారు.

నో పవర్ కట్





- ఈ వేసవిలో విద్యుత్ కోతలకు సెలవు
- నిరంతర సరఫరాకు అధికారుల చర్యలు
- సత్ఫలితాలనిస్తున్న ముందస్తు కసరత్తు
- వినియోగం పెరిగినా ఇబ్బంది లేనట్టే

సాక్షిప్రతినిధి, కాకినాడ: ఈ వేసవిలో విద్యుత్ కోత లాంటి వెతలు ఉండవు. గత ఏడాది తరహాలోనే ఈ సారి కూడా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. లైన్‌లాస్‌లను తగ్గించడం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడం లాంటి చర్యలు ఇందుకు దోహదపడుతున్నాయి. దీంతో ఈ వేసవి సీజన్‌లో ప్రజలకు విద్యుత్ కోతలు లేకుండా చూస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలలు వచ్చాయంటే గతంలో కోతలతో ప్రజలు నరకం చూసేవారు. లోడ్ రిలీఫ్ (ఎల్.ఆర్.), మెయింటినెన్స్ వంటి పేర్లతో దొడ్డిదారిన విద్యుత్ సరఫరాకు కోతలు పెట్టేవారు. అటువంటి పరిస్థితికి భిన్నంగా విద్యుత్ సరఫరాలో ఈసారి గణనీయమైన ప్రగతిని సాధించారని చెప్పవచ్చు. ఎండల ఫలితంగా విద్యుత్ వినియోగం పెరిగినా ఎక్కడా కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నారు. ఈదురుగాలులు, వర్షాల సమయంలో మాత్రమే సరఫరాకు అంతరాయం కలుగుతోంది తప్ప మిగిలిన సందర్భాల్లో సరఫరాకు ఎటువంటి ప్రతిబంధకాలు ఉండటం లేదు. కోతల పరిస్థితి ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.57.40 కోట్లు వెచ్చించింది. దీంతో సుమారు 808 అదనపు విద్యుత్ సరఫరా ట్రాన్స్‌ఫార్మర్లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయగలిగారు.

మార్చి నుంచి పెరుగుదల

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మండుతోన్న ఎండలతో రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరిగిపోతోంది. గత మార్చి రెండో వారంలో మొదలైన వేసవి తీవ్రత ఏప్రిల్ మొదటి వారానికి వచ్చేసరికి ఒక్కసారిగా పెరిగిపోయింది. గడచిన వారం రోజులుగా మరింత పెరిగింది. మధ్యాహ్నం ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. ఇలా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు, రాత్రి 8 గంటలు దాటిన తరువాత నుంచి ఇళ్లల్లో విద్యుత్ వినియోగం బాగా పెరిగిపోయింది. పట్టణాల్లో సంపన్న వర్గాల ఇళ్లల్లోనే ఏసీలు ఉండేవి. ఇప్పుడు సులభతరమైన చెల్లింపులు అందుబాటులోకి రావడంతో చిన్న, మధ్యతరగతి అనే తేడా లేకుండా అన్ని ఇళ్లలోనూ దాదాపు ఏసీలు వినియోగిస్తున్నారు.

సబ్ స్టేషన్ల ఏర్పాటు

వేసవి వచ్చీ రావడంతోనే ఇప్పుడు గృహ విద్యుత్ వినియోగం పెరిగిపోతోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ వినియోగానికి తగ్గట్టుగానే విద్యుత్ ఉత్పత్తికి ఢోకా లేకపోవడంతో కోతలు విధించాల్సిన అవసరం ఎదురుకాదని ఏపీఈపీడీసీఎల్ వర్గాలు చెబుతున్నాయి. సరఫరాకు ఇబ్బందులు ఎదురుకాకుండా మల్కిపురం, కోనపాపపేట, ఆర్సీపురం, ఆనందభారతి, వలసపాకల, అంతర్వేది, పెదపూడి, కామనగరువు, కరకుదురు, చెయ్యేరు, తాళ్లరేవు, సుబ్బారావునగర్, మల్లాం తదితర ప్రాంతాల్లో 33/11 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు కాకినాడ, జగ్గంపేట, అమలాపురం, రాజమహేంద్రవరం, రామచంద్రపురంలలో అదనపు సామర్థ్యంతో సబ్ స్టేషన్లు నెలకొల్పారు.

గృహ వినియోగమే ఎక్కువ..

విద్యుత్ వినియోగంలో గృహ వినియోగానిదే సింహభాగం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 16,23,138 గృహ విద్యుత్ వినియోగ కనెక్షన్లు ఉన్నాయి. వీటి వినియోగం విషయంలోనే హెచ్చు, తగ్గులు ఉంటుంటాయి. గత జనవరి నుంచి ఏప్రిల్ (ప్రస్తుతం)వరకు గృహ విద్యుత్ వినియోగాన్ని పరిశీలిస్తే ప్రతి నెలా రెండు నుంచి నాలుగు మిలియన్ యూనిట్లు పెరుగుతూ వస్తోంది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో గృహ విద్యుత్ వినియోగం ముందస్తు అంచనాల ప్రకారం చూస్తే 50 మిలియన్ యూనిట్ల నుంచి 100 మిలియన్ యూనిట్లు పెరిగే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అందుకు తగ్గట్టుగా సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇతర వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ కేటగిరీలలో వినియోగం విషయంలో పెద్దగా వ్యత్యాసం కనిపించడం లేదు. ఎటొచ్చీ వరి పంట దిగుబడి చేతికొచ్చాక రైస్‌మిల్లులలో వినియోగం పెరుగుతుంది. వేసవి రాక ముందు వరకు రోజుకు 16 మిలియన్ యూనిట్ల వినియోగం ఉండేది. ప్రస్తుతం రోజుకు 17 నుంచి 18 మిలియన్ యూనిట్ల వినియోగం ఉంటోంది. మే నెల వచ్చేసరికి 20 లేదా 21 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. విద్యుత్ లోడు ప్రస్తుతం 870 నుంచి 880 మెగావాట్లు ఉంది. ఇది వచ్చే మే నెలకు 1,050 మెగావాట్ల నుంచి 1,100 మెగావాట్లను అధిగమిస్తుందని అంచనా వేస్తున్నారు.

రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలో వినియోగం (మిలియన్ యూనిట్లలో)

కేటగిరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్-అంచనా	మే-అంచనా	జూన్-అంచనా
గృహవినియోగం	148.32	151.70	213.97	221.98	252.93
వాణిజ్యం	42.33	42.28	49.56	51.49	57.37
పరిశ్రమలు	125.59	147.64	109.15	126.47	139.14
వ్యవసాయం	51.39	78.76	52.23	63.20	30.52
ఇతర కేటగిరీలు	90.53	96.57	96.69	73.98	70.21
మొత్తం	**458.16**	**516.95**	**521.61**	**537.12**	**550.17**

ముందస్తు చర్యలు



వేసవి సీజన్ మొదలైంది. సర్కిల్ పరిధిలో డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ ఉత్పత్తి ఉంటుందని పై నుంచి ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా ఈ వేసవిలో విద్యుత్ కోతలు దాదాపు ఉండవు. ఏ ఒక్క వినియోగదారుడికి ఇబ్బంది కలగని రీతిలో ఏర్పాట్లు చేస్తున్నాం. గతేడాది విద్యుత్ వినియోగం అంచనాలను దృష్టిలో పెట్టుకుని ఈ సీజన్‌లో విద్యుత్ ఎంత అవసరం అవుతుందో లెక్కలేశాం. గతేడాది ఎదురైన ప్రతిబంధకాలను అధిగమించేందుకు అనేక ముందస్తు చర్యలు తీసుకున్నాం. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాం.

– టీవీఎస్ఎన్ మూర్తి, సూపరింటెండెంట్ ఇంజినీర్, ఏపీఈపీడీసీఎల్, (ఆపరేషన్)

గంజాయి పట్టిస్తే బహుమానం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా. చిత్రంలో ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి తదితరులు

అమలాపురం రూరల్: జిల్లాలో గంజాయి రవాణా, అమ్మే వారి(పెడ్లర్స్)సమాచారం పోలీసులకు అందిస్తే, దాని విలువ రూ.50 వేలకు పైబడి ఉంటే రూ.10 వేలు బహుమతిగా ఇస్తామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. జిల్లా స్థాయి ఎన్‌సీవోఆర్డీ సమావేశం కలెక్టరేట్‌లో గురువారం జరిగంది.ఎస్పీ సీహెచ్ సుదీర్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ లతామాధురి, ట్రైనీ ఐపీఎస్ పంకజ్ మీనా పాల్గొన్న ఈ సమావేశంలో కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ గంజాయి తాగడం యువతకు సోషల్ స్టేటస్‌గా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అమలాపురంలోని ఏరియా హాస్పిటల్‌లో డి- అడిక్షన్ కేంద్రం ఉందని, నియోజకవర్గానికి ఒక డి అడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని డీఎంఅండ్‌హెచ్‌వోను కలెక్టర్ శుక్లా ఆదేశించారు. ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సచివాలయ పరిధిలో, స్కూల్స్ కాలేజీలు, హాస్పిటల్స్‌లో డి అడిక్షన్ కేంద్రాలకు వచ్చే గంజాయి తాగేవారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందిస్తే వీరి ద్వారా అమ్మేవారిని, రవాణా చేసేవారిని గుర్తించవచ్చని ఎస్పీ తెలిపారు. రాబోయే మూడు నాలుగు నెలల్లో గంజాయి జిల్లాలో సరఫరా అవ్వకుండా నియంత్రిస్తే వినియోగించేవారు బయటకు వస్తారన్నారు. వారిని గుర్తిస్తే 87126 92102 ఫోన్ నంబర్‌కు కాల్ చేసి కానీ, వాట్సాప్ ద్వారా గాని సమాచారం అందించొచ్చని ఎస్పీ వివరించారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో అమలాపురం వసంతరాయుడు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య ద్వారా విద్య.. ఆరోగ్యం

కేంద్రం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా ఉన్న స్పాన్సర్ షిప్ ప్రోగ్రాం ద్వారా నిరాదరణకు గురైన బాలలకు విద్య, ఆరోగ్యం, అభివృద్ధి అవసరాలకు ఆర్థిక సహాయంగా అందిస్తామని కలెక్టర్ శుక్లా తెలిపారు. కలెక్టరేట్లో మిషన్ వాత్సల్య స్పాన్సర్ షిప్ ప్రోగ్రాం కరపత్రికను కలెక్టర్ శుక్లా, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావుతో కలిసి విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకంలో బాలలు కుటుంబ వాతావరణంలో పెరగడానికి నెలకు రూ.నాలుగు వేల చొప్పున అందిస్తామన్నారు. మహిళా శిశు సంక్షేమ సాధికారిత జిల్లా అధికారిణి జి.సత్యవాణి పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం

ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రారంభించిన మంత్రులు విశ్వరూప్, వేణు



జనుపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రారంభించి వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఫ్యామిలీ డాక్టర్ విధానానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గురువారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అమలాపురం మండలం జనుపల్లి గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబర్‌లో ఈ కార్యక్రమాన్ని ట్రైల్ రన్ గా ప్రారంభించారని చెప్పారు. ఇప్పటి వరకు కోనసీమ జిల్లాలో ఈ కార్యక్రమంలో భాగంగా 22 ఎంఎంయూ (104) వాహనాల ద్వారా ఒక్కొక్క వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నెలకు ఒకసారి వైద్య సేవలు అందజేశామన్నారు. ఇక నుంచి 36 ఎంఎంయూ(104) వాహనాల ద్వారా కోనసీమ జిల్లాలోని 432 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో నెలకు రెండుసార్లు గ్రామాలలో వైద్య సేవలు అందిస్తామన్నారు. పి గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామాలలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో నెలకు రెండు పర్యాయాలు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓపీ వైద్య సేవలు నిర్వహిస్తారని చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నడవలేని స్థితిలో ఉన్న, మంచానికే పరిమితమైన వ్యాధిగ్రస్తులు, ఆరోగ్యశ్రీలో భాగంగా వివిధ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ప్రతి మండలంలో రెండు పీహెచ్‌సీలకు ఇద్దరు డాక్టర్లను నియమించామని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ అందుబాటులో ఉండటం వల్ల సత్వర సేవలు అందుతాయని తెలిపారు. ఆర్డీవో వసంతరాయుడు, డీఎంహెచ్ఓ దుర్గారావు దొర, ఫ్యామిలీ ఫిజిషియన్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుమలత, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సర్పంచ్ గానాల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, తహసీల్దార్ పరమట పల్లివి, ఎంపీడీవో కాశీ విజయప్రసాద్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ వాసునాయక్, కార్యదర్శి రెడ్డి శిరీష్ పాల్గొన్నారు.

ప్రతి గడపకూ వైద్యమే ఫ్యామిలీ డాక్టర్ విధానం

కె.గంగవరం: ప్రతి ఇంటికి వెళ్లి మెరుగైన వైద్యం అందించేందుకే ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభించిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. మండల పరిధిలోని సత్యవాడలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం పెద్ద రోగమని దీనికి తోడు పేదవాడు జబ్బు బారిన పడితే ఆ కుటుంబం పరిస్థితి మరింత దిగజారిపోతుందని గ్రహించి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకువచ్చారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి ఎన్నో కుటుంబాలకు ఉచితంగా వైద్య సేవలు అందించి పేదవారి హృదయాల్లో నిలిచిపోయారన్నారు. ఆయన బాటలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకంలో మరిన్ని జబ్బులను చేర్చారని చెప్పారు. దీనికితోడు ఫ్యామిలీ డాక్టర్‌ను తీసుకువచ్చి ప్రతి మండలానికి రెండు 104 వాహనాలను ఏర్పాటు చేశారన్నారు. ఇకపై పేదవాడికి అనారోగ్యం వస్తే వైద్యుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఊరిలోనే డాక్టర్‌ను, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందిస్తారని భరోసా ఇచ్చారు.



104 వాహనాన్ని ప్రారంభించిన మంత్రి వేణు

ఇకపై రెండు వాహనాలు

మండలానికి మంజూరైన రెండో 104 వాహనాన్ని మంత్రి చెల్లుబోయిన వేణు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఇప్పటి వరకు మండలానికి ఒక్కటి మాత్రమే 104 వాహనం ఉండేదని, ఇప్పటి నుంచి రెండు వాహనాలు అందుబాటులో ఉండి నెలకు రెండు సార్లు ప్రతి గ్రామాన్ని సందర్శిస్తాయన్నారు. ఈ వాహనంలోని వైద్య సిబ్బంది 14 రకాల పరీక్షలు నిర్వహిస్తారని, 67 రకాల మందులు అందిస్తారని చెప్పారు. ఈ వాహనంలో ఈసీజీ తీసే సౌకర్యం కూడా ఉందన్నారు. ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఓబులనేని శ్రీవరలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యులు డి.మాణిక్యం, సర్పంచ్ సలాది వెంకన్న, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మండల కన్వీనర్ తోకల శ్రీను, జిల్లా వ్యవసాయ సలహా కమిటి సభ్యులు బత్తుల అప్పారావు, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, పిల్లి దుర్గాప్రసాద్, గ్రామ పెద్దలు సలాది అర్జునరావు, సలాది సూర్యప్రకాష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి రూ.2 లక్షల విరాళం



స్వామి చిత్రపటం అందుకుంటున్న భాస్కరరావు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన భక్తుడు అయితం సూర్య భాస్కరరావు రూ.2 లక్షలు విరాళం అందజేశారు. ఇందులో శాశ్వత నిత్యాన్నదానానికి రూ.1,00,000, నారసింహ సుదర్శన హోమానికి రూ.1,00,000 విరాళం ఇచ్చారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని ఆయనకు అందజేశారు.

ప్రోత్సాహంతో హృద్యానం

- కోనసీమ జిల్లాలో ఉద్యాన పంటలకు ప్రభుత్వం దన్ను
- ఉత్పత్తుల నిల్వలకు స్టోరేజ్ రూమ్‌లు, ప్యాక్ హౌస్‌ల నిర్మాణం
- గత ఏడాది రాయితీ రూపంలో రూ.3.05 కోట్లు
- మామిడి, జామ, బత్తాయి వంటి పంటల విస్తరణకు ప్రోత్సాహకాలు

సాక్షి అమలాపురం: వరి సాగుకు ప్రత్యామ్నాయంగా జిల్లా రైతులు ఉద్యాన పంటల వైపు మొగ్గ చూపుతుండడంతో ఆ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు రాయితీలు.. ప్రోత్సాహకాలు అందిస్తోంది. పంట నిల్వకు ప్యాక్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజ్‌లు, కలెక్షన్ సెంటర్ల నిర్మాణాలకు, కొబ్బరి, మామిడి, కోకో, జీడిమామిడి వంటి పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు సైతం రాయితీలు ఇస్తోంది. జిల్లాలో 1,53,618 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు జరుగుతోంది. అత్యధికంగా కొబ్బరి 1.10 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుండగా, కోకో, అరటి, పోక, మామిడి బొప్పాయి, బత్తాయి, పనస, ఆరంజ్, కూరగాయలు వంటివి పండిస్తున్నారు. సాగు విస్తీర్ణం పెరుగుతుండడంతో ప్రభుత్వం పలు రకాల రాయితీలిస్తోంది. 2022-23కు గాను రూ.3,05,53,095 రాయితీల రూపంలో అందించింది.

పంట నిల్వలకు ప్యాక్ హౌస్‌లు

ఉద్యాన పంటలైన కొబ్బరి, కూరగాయ పంటలు, పండ్లను నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ప్యాక్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజ్‌లు, కలెక్షన్ సెంటర్లను నిర్మిస్తోంది. జిల్లాలో కొబ్బరికాయలు నిల్వ చేసేందుకు 37 కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం యూనిట్‌కు రూ.11.25 లక్షల రాయితీ ఇస్తోంది. రాష్ట్రీయ క్రిషీ వికాస్ యోజన (ఆర్‌కేవీవై) ద్వారా యూనిట్‌కు రూ.5.25 లక్షల చొప్పున, మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఫర్ హార్టీకల్చర్ (ఎంఐడీహెచ్)కు రూ.ఆరు లక్షల చొప్పున, కోల్డ్‌స్టోరేజ్‌కు ఆర్‌కేవీవైలో రూ.ఆరు లక్షలు, ఎంఐడీహెచ్‌లో రూ.5.25 లక్షల చొప్పున రాయితీ అందిస్తున్నారు. ఈ రెండు పథకాల ద్వారా అందిన రాయితీలో 17 కలెక్షన్ సెంటర్లు, ఆరు కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణాలు చేయగా వీరికి రూ.2,58,75,000 ఇచ్చారు. ఉద్యాన పంటల ప్రోత్సాహంలో భాగంగా 398.45 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి, జీడిమామిడి, బత్తాయి, జామ, కోకో, బొప్పాయి, కూరగాయలు వంటి పంటలకు గాను రూ.46,78,095 రాయితీల రూపంలో అందించింది.



మామిడికుదురు మండలం పెదపట్నంలంకలో నిర్మించిన కలెక్షన్ సెంటరు

ఉద్యాన రైతులకు అన్ని రకాల ప్రోత్సాహాలు



ఉద్యాన పంటను నిల్వ చేసుకునేందుకు ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలో కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌ల నిర్మాణం చేపట్టాం. కొత్తగా ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు సైతం ఏడాది నుంచి మూడేళ్ల పాటు వివిధ రూపాల్లో రాయితీలు అందిస్తున్నాం.

– నేతల మల్లికార్జునరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి

జిల్లాకు ఆర్‌కేవీవై... ఎంఐడీహెచ్ పథకాలలో రాయితీలు ఇలా..

పథకం	మొత్తం యూనిట్ల లక్ష్యం	యూనిట్ రాయితీ	నిర్మించినవి	ఇచ్చిన రాయితీ రూపాయిలలో
కలెక్షన్ సెంటర్ (ఆర్‌కేవీవై, ఎంఐడీహెచ్)	37	11,25,000	17	1,91,25,000
కోల్డ్ రూమ్ (ఆర్‌కేవీవైలో)	6	11,25,000	6	67,50,000

ఉద్యాన పంటల విస్తరణ పథకంలో రాయితీలు

రాయితీకి ఎంపిక చేసిన పంటలు	జిల్లాకు కేటాయింపు (హెక్టార్లలో)	రాయితీ	రైతులకు ఇచ్చింది (హెక్టార్లలో)	మొత్తం ఇచ్చిన రాయితీ
మామిడి	10	7.980	8	63,840
జామ	10	17,599	3	52,797
బత్తాయి	25	9,602	10.2	97,940
జీడిమామిడి	100	12,000	44.24	5,30,880
బొప్పాయి	30	18,497	67.34	12,45,587
కూరగాయలు	100	20,000	70.42	14,08,400
పందిర కూరగాయలు	4.4	2,50,000	2.04	5,10,000
బత్తాయి (రెండో ఏట పంట)	18.87	3,201	18.87	60,402
మామిడి (మూడో ఏట	5	2,660	5	13,300
జామ (మూడో ఏట)	15.15	5,866	15.15	88,869
బత్తాయి (మూడో ఏట	13.52	3,210	13.52	43,400
కోకో	132.67	4,000	132.67	5,30,680
జీడిమామిడి (మూడో ఏట)	8	4,000	8	32,000

క్లుప్తంగా

10న బీఈడీ మిగులు సీట్ల భర్తీ

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 10న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఏయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల, ఐఏఎస్ఈలో కొన్ని సీట్లు మిగిలాయని, వీటిని ఎడ్‌సెట్ 2022లో అర్హత సాధించిన వారితో స్పాట్ అడ్మిషన్ల విధానంలో భర్తీ చేస్తున్నామన్నారు. ఖాళీల వివరాలు www.audoa.in వెబ్‌సైట్‌లో పొందుపరిచారన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు నేరుగా తమ విద్యార్హత తెలిపే సర్టిఫికెట్లు, ఎడ్‌సెట్ ర్యాంక్ కార్డులతో నేరుగా హాజరు కావాలని సూచించారు.

గోపాలపురం ఘటనపై విచారణ



డైరెక్టర్ హర్షవర్ధన్‌తో నాటి ఘటనపై చర్చిస్తున్న దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: రావులపాలెం మండలం గోపాలపురంలోని ఒక హోటల్‌లో గతంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రం ఉన్న ప్లేట్లను ఉపయోగించిన ఘటనపై రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ హర్షవర్ధన్ ఆ శాఖ జిల్లా కార్యాలయంలో గురువారం విచారణ నిర్వహించారు. నాటి ఘటనలోని 18 మంది బాధితులను, హోటల్ యాజమానిని విచారించారు. అప్పట్లో ఈ ఘటనపై దళిత యువకులపై పోలీసు కేసు నమోదు చేయడంపై బాధితులు రాష్ట్ర ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించడంతో ఈ విచారణ చేపట్టారు. హోటల్ యాజమాని నుంచి, బాధితుల నుంచి ఆయన స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకున్నారు. విచారణ జరుగుతున్న సమయంలో దళిత యువకులపై కేసులు ఎత్తివేయాలని, హోటల్ యాజమానిని శిక్షించాలని డిమాండు చేస్తూ దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు కార్యాలయం ఎదట ధర్నా చేశారు. అనంతరం ఆ శాఖ డైరెక్టర్ హర్ష వర్ధన్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. దళిత సంఘాల ప్రతినిధులు రేవు తిరుపతిరావు, జంగా బాబూరావు, బొంతు రమణ, గెల్లా రాజేంద్ర, గెడ్డం శ్రీనివాస్, శ్రీనివాస్, మెండి డేవిడ్ అంబేడ్కర్, గోసంగి వెంకటేష్ ధర్నా చేసిన వారిలో ఉన్నారు.

పకడ్బందీగా ఇంటర్ మూల్యాంకనం

- విధులు నిర్వర్తిస్తున్న 1,500 మంది అధ్యాపకులు
- ఈ నెల 25వ తేదీకి పూర్తయ్యే అవకాశం



ఇంటర్ పరీక్షల మూల్యాంకనం జరుగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియేట్ స్పాట్ వాల్యుయేషన్ ఉమ్మడి జిల్లాల కేంద్రంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి కట్టుదిట్టమైన భద్రత నడుమ సాగుతోంది. గత నెల 15న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు ఈ నెల నాలుగో తేదీతో ముగిసాయి. ఈ పరీక్షల మూల్యాంకనాన్ని ఉమ్మడి జిల్లాలో మూడు విడతలుగా నిర్వహిస్తున్నారు. మొత్తం 13 సబ్జెక్టులకు సంబంధించి పేపర్లు రాజమహేంద్రవరం కేంద్రానికి చేరాయి. ఈ జవాబు పత్రాలను దిద్దే పనిలో అధ్యాపకులు పూర్తిగా నిమగ్నమయ్యారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. మూల్యాంకనం దిద్దే ప్రక్రియకు హాజరైన సమయం నుంచి బయటకు వెళ్లే వరకు అధ్యాపకులకు, అక్కడ పనిచేసే సిబ్బందికి సెల్‌ఫోన్ నిషేధించారు. ఎట్టి పరిస్థితుల్లోను లోపలికి ఎటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను తీసుకెళ్లకూడదని ఇంటర్ బోర్డు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మూల్యాంకనం జరుగుతున్న ప్రభుత్వ కళాశాల ప్రాంతంలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. రోజుకి ఒకో అధ్యాపకుడు 30 పేపర్ల వరకు మూల్యాంకనం చేస్తున్నారు. సుమారు నెలరోజుల పాటు జరగనున్న ఈ ప్రక్రియను ఇంటర్ బోర్డు స్టేట్ అబ్జర్వర్లు ప్రతీ రోజు పర్యవేక్షిస్తున్నారు. మూల్యాంకనం పూర్తయ్యే వరకు ప్రభుత్వ కళాశాల వద్ద పూర్తి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా సాగుతోంది



ఇంటర్ పరీక్షల మూల్యాంకనం ఉమ్మడి జిల్లాల కేంద్రంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాలలో ప్రశాంతంగా జరుగుతోంది. ఇప్పటికే రెండు స్పెల్స్ పూర్తయ్యాయి. మూడో స్పెల్ ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. మూల్యాంకనం పూర్తి సీసీ కెమెరా నిఘాలో జరుగుతోంది. నిత్యం మూల్యాంకన కేంద్రాన్ని ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులతో పాటు మేము పరిశీలిస్తున్నాం. ఈ నెల 25వ తేదీ లోగా మూల్యాంకన ప్రక్రియ పూర్తికావచ్చు.

– ఐ.శారద, జోన్ 1,2 రీజినల్ జాయింట్ డైరెక్టర్, ఇంటర్‌బోర్డు

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

- ఆస్పత్రికి వెళుతుండగా దుర్ఘటన
- కళ్లెదుటే తల్లి మరణించడంతో కూతురు విలవిల



దుర్గ మృతదేహం

అమలాపురం టౌన్: ఆస్పత్రికి వైద్యం నిమిత్తం వెళుతున్న తల్లీ కూతుళ్ల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తల్లి అక్కడికక్కడే ఆర్టీసీ బస్సు కింద పడి ప్రాణాలు విడిచింది. అమలాపురం గడియారం స్తంభం సెంటరు సమీపంలో కుంకుల సందు వద్ద గురువారం ఉదయం 11.40 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. అమలాపురం రూరల్ మండలం రెడ్డిపల్లికి చెందిన రేలంగి దుర్గ (49) ప్రమాదంలో మృతి చెందింది. ఆమె కుమార్తె లక్ష్మీ దుర్గ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకుంది. కుమార్తె లక్ష్మీదుర్గ స్కూటీపై తన తల్లి దుర్గను ఎక్కించుకుని అమలాపురంలోని ఓ ఆస్పత్రికి వస్తోంది. ఆ సమయంలో అమలాపురం నుంచి కాకినాడకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి స్కూటీని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తల్లి తల బస్సు చక్రం కింద పడడంతో తక్షణమే ప్రాణాలు విడిచింది. మృతురాలు దుర్గకు భర్త, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త కృష్ణ దినసరి కూలి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన కళ్ల ముందే కన్న తల్లి ప్రమాదంతో కన్ను మూయడంతో ఆమె కుమార్తె లక్ష్మీదుర్గ ఘటనా స్థలంలోనే గుండెలవిసేలా విలపించింది. స్కూటీపై తనతో పాటు వచ్చి అమ్మ ప్రాణాలు పోగొట్టుకోవడంపై మృతురాలు కుమార్తె మరీ కుమిలిపోయింది. పట్టణ ఎస్సై జి.హరీష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుర్గ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. జనం, వాహనాల రద్దీగా ఉండే ఆ రోడ్డులో ఆటోలు ఎక్కడపడితే అక్కడ ఆపి, ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ట్రాఫిక్ మరింత జటిలంగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు.

భారీగా గంజాయి పట్టివేత

- వ్యాన్ డ్రైవర్ అరెస్ట్, మరో ఇద్దరు పరారీ
- రూ.20.88 లక్షల విలువైన సరకు, వాహనం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్ట్ చేసిన నిందితుడితో పోలీసులు

కొవ్వూరు: అక్రమంగా తరలిస్తున్న 25 బస్తాల్లోని 696.75కిలోల గంజాయిని గురువారం స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపారు. ఈ కేసులో కర్ణాటకకు చెందిన వ్యాన్ డ్రైవర్ సాగర్ కేదార్ శివపూర్‌ని అరెస్ట్ చేశామన్నారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎస్సై డి.భూషణం తన సిబ్బందితో ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజమహేంద్రవరం వైపు నుంచి వస్తున్న వ్యాన్ పరిశీలించగా కొబ్బరి బొండాల లోడు మాటున గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కె.అజయ్‌బాబు సమక్షంలో తనిఖీ చేసి 25 బస్తాల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి విలువ రూ.20,88,225 ఉంటుందన్నారు. వ్యాన్ ఓనర్ రాము అనే వ్యక్తి పాడేరులో కృష్ణ అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి కత్తిపూడి తీసుకొచ్చాడు. అక్కడి నుంచి గంజాయిని వ్యాన్‌లో రవాణా చేస్తున్నారని అన్నారు. వ్యాన్‌కి ముందుగా యజమాని రాము కారులో వెళుతున్నాడని అన్నారు. వ్యాన్ పట్టుబడడంతో అతను పరారీ అయ్యాడన్నారు. ప్రధాన నిందితుడు రాముతో పాటు గంజాయి విక్రయించిన కృష్ణను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. డ్రైవర్‌ని అరెస్ట్ చేసి అతని వద్ద రూ.500ల నగదు, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సై పి.రవీంద్రబాబు, బి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టి యువకుడి మృతి

అల్లవరం: అల్లవరం మండలం దేవగుప్తం పంచాయతీ పరిధిలోని చింతలమెరకలో బుధవారం రాత్రి ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వేగంగా వెళ్తూ కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మానుపాటి దుర్గాప్రసాదు (24) మృతిచెందగా, దాసరి రాజేష్‌కుమార్ (25) తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల వివరాలు ప్రకారం దేవగుప్తం మార్కెట్‌వీధికి చెందిన మానుపాటి దుర్గాప్రసాదు తన స్నేహితుడు చింతల మెరకకు చెందిన రాజేష్‌ని మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని అల్లవరంలో తమ సామాజిక వర్గ సమావేశానికి బుధవారం ఉదయం హాజరయ్యాడు. మీటింగ్ అనంతరం అక్కడ నుంచి సామంతకుర్రులోని తన మేనత్త ఇంటికి వెళ్లి సాయంత్రం వరకు గడిపి ఏడు గంటల సమయంలో అల్లవరం వెళ్తుండగా డి.రావులపాలేనికి చెందిన గుడ్ల వ్యాపారి స్వగ్రామానికి వస్తుండగా నల్లగంటు వద్ద తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాదుకి తల పగిలి తీవ్ర రక్తస్రావం కాగా, రాజేష్‌కి తీవ్ర గాయాలయ్యాయి. రక్తస్రావంతో ఉన్న వీరిని దుర్గాప్రసాదు తల్లి మంగాదేవి 108లో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. దుర్గప్రసాదుని వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. రాజేష్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని ఎస్సై శ్రీనునాయక్ గురువారం తెలిపారు. మృతుడుకి భార్య, కుమారుడు ఉన్నారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హోంగార్డు ఆత్మహత్యాయత్నం

పిఠాపురం: పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు గురువారం ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. హోంగార్డు రామకృష్ణ ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో అప్పుల బాధలు తట్టుకోలేక గడ్డి మందు తాగినట్లు ఆయన కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పిఠాపురం పట్టణ ఎస్సై జగన్మోహన్ తెలిపారు. తీవ్ర అస్వస్థతకు గురైన రామకృష్ణ కాకినాడలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు.

సెంట్రింగ్ కార్మికుడి మృతి



దుర్గాప్రసాద్ (ఫైల్)

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ సెంట్రింగ్ కార్మికుడు విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ మరణించాడు. కాకినాడ పాతగైగోలుపాడుకు చెందిన వాసంశెట్టి దుర్గాప్రసాద్(25) స్థానిక ద్వారకానగర్‌లో ఓ అపార్టుమెంటులో గురువారం సెంట్రింగ్ పనికి వెళ్లాడు. విధి నిర్వహణలో ఉండగా ఐదవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దుర్గాప్రసాద్‌కు భార్య దుర్గా పావని సహా ఐదు నెలల కుమార్తె ఉన్నారు. పసిపాపకు పేరైనా పెట్టకుండానే తండ్రి దూరం కావడంతో ఆ పేద కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది.

పవన్‌కల్యాణ్‌ను చూసి సిగ్గుపడుతున్నాం

- తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెడతారా?
- పవన్ ఢిల్లీ పర్యటనపై ఎంపీ భరత్ వ్యాఖ్యలు



మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: ప్రధాని మోదీ, అమిత్ షాలను కలసి వస్తానని ఢిల్లీ వెళ్లిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మూడురోజుల పాటు వేచి చూసినా కలవలేకపోయారని, పవన్‌తో మాట్లాడేందుకు బీజేపీ పెద్దలు ఆసక్తి చూపించలేదని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. గురువారం స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్ చర్యలతో తెలుగువారి ఆత్మగౌరవం దెబ్బతిందన్నారు. ఢిల్లీలో బీజేపీ పెద్దలు మోదీ, అమిత్‌షాలను కలిసేందుకు పవన్ ఎంత ప్రయత్నించినా.. ఫలితం లేకపోయిందంటే ఆయనపై విశ్వసనీయత లేదనే అర్థమవుతుందన్నారు. ఇది పవన్‌కల్యాణ్‌కు ఎలా ఉందో కానీ.. ఆయన అభిమానులు, రాష్ట్ర ప్రజలకు చాలా సిగ్గుగా ఉందన్నారు. కేంద్రంలోని పెద్దలు పిలిస్తే వెళ్లారా, లేక చంద్రబాబు అజెండా మోయడానికి వెళ్లారో ప్రజలు గ్రహించారని అన్నారు. గతంలో బీజేపీని ఎన్ని మాటలన్నారో, చంద్రబాబును ఎలా విమర్శించారో ప్రజలు మరిచిపోలేదన్నారు. ఇప్పుడెలా సఖ్యత కుదిరిందో అర్థం కావడం లేదన్నారు. నిజంగా బీజేపీకి జనసేన మిత్రపక్షమైతే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్‌కు మద్దతు ఎందుకు ఇవ్వలేదని ఎంపీ భరత్ ప్రశ్నించారు. కనీసం ఒక సమావేశం నిర్వహించో, ఒక ప్రెస్‌నోట్ విడుదల చేసో సదరు ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి ఎందుకు సహకరించలేదని అన్నారు. మిత్ర ధర్మాన్ని విస్మరించడంతోనే మిమ్మల్ని కలవడానికి మోదీ, అమిత్ షాలకు మనసు అంగీకరించలేదన్నారు. విలువలు, విశ్వసనీయత లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. తెలుగువాడిగా ఢిల్లీలో పడిగాపులు పడటం మీకెలా ఉందో తెలియదు కానీ.. రాష్ట్ర ప్రజలకు తీరని అవమానం, సిగ్గుగా ఉందన్నారు. ఇకపై ఇటువంటి పనులు చేసి ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టవద్దని పవన్‌కల్యాణ్‌కు ఎంపీ భరత్ విజ్ఞప్తి చేశారు. పవన్ మాటల్లో పొంతన ఉండదని, అందుకే బీజేపీ పెద్దలు ఎంతలో ఉంచాలో అంతలోనే ఉంచుతున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీకి ముసుగులో గుద్దులాట ఉండదని, మేనిఫెస్టో తమకు పవిత్ర గ్రంథం లాంటిదని అన్నారు. చెప్పింది చేస్తున్నాం కాబట్టే ప్రజలు జగనన్నను, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని విశ్వసిస్తున్నారని వివరించారు.

అన్యాయంగా బలైపోయింది

- నెల్లూరు యువకుడి చేతిలో హత్యకు గురైన శ్రీదేవి కుటుంబీకుల ఆవేదన
- వెంకట రమణ కుటుంబమే ఆదుకోవాలని డిమాండ్



మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేస్తున్న శ్రీదేవి భర్త ఏసు, పిల్లలు, బంధువులు

అమలాపురం టౌన్: ఎవరి మీదో కోపం, కక్షతో వచ్చిన నెల్లూరు కుర్రోడి చేతిలో ఆ ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తున్నందుకు నా భార్య అన్యాయంగా బలైపోయిందని మృతురాలు శ్రీదేవి భర్త మన్నే ఏసు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తల్లి మృతితో వెక్కివెక్కి ఏడుస్తున్న శ్రీదేవి కుమార్తెలు సత్య హర్షిత (10), ప్రమీల(8) 'అమ్మా మమ్మల్ని విడిచి వెళ్లిపోయావా' అంటూ విలపిస్తున్నారు. స్థానిక ఏఎంజీ కాలనీలోని శ్రీదేవి ఇంటి వద్ద ఆమె కుటుంబీకులు, బంధువులు మీడియా ఎదుట గురువారం తమ ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటరమణ ఇంట్లో ఒకరు చేసిన తప్పునకు మా శ్రీదేవిని చంపేశారన్నారు. వెంకటరమణ ఇంట్లో 15 ఏళ్లుగా నమ్మకంగా పనిచేస్తున్నందుకు అక్కడ మా శ్రీదేవి చావును చూడాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భర్త ఏసు కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడని, పిల్లలను ఆదుకోవాల్సిన బాధ్యత వెంకటరమణ కుటుంబంపై ఉందని శ్రీదేవి అక్క దుర్గ అన్నారు. శ్రీదేవి ఆ ఇంట్లో పనిచేస్తూ పిల్లల కోసం కొంత సొమ్ము దాచుకుందని పేర్కొన్నారు.

హామీతో ఆందోళన విరమణ

సాయంత్రం 6 గంటల సమయంలో మృతురాలు శ్రీదేవి కుటుంబీకులు, బంధువులు, ఇరుగు పొరుగు వారు దాడి జరిగిన వెంకటరమణ ఇంటికి వెళ్లి ఆందోళన వ్యక్తం చేశారు. తల్లి మృతితో దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్న ఆమె పిల్లలను ఆదుకోవాలని వెంకటరమణ కుటుంబీకులను అడిగారు. శ్రీదేవి కుటుంబానికి తాము న్యాయం చేస్తామని వారు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మంత్రి విశ్వరూప్ రూ.25 వేల సాయం

శ్రీదేవి హత్య తర్వాత ఆమె పిల్లలను చూసి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చలించారు. ఆ బాధిత కుటుంబానికి తన వంతు సాయంగా రూ.25 వేలు అందించారు. ఆ పిల్లలకు ఉచిత చదువు చెప్పించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తానన్నారు. ఇంటి స్థలం కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చారని మృతురాలి భర్త ఏసు, అక్క దుర్గ విలేకర్లకు తెలిపారు.